సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023

నగరం ఆధ్యాత్మికమయం..

నగరంలో ఒకవైపు హనుమాన్ జయంతి వేడుకలు, మరోవైపు విశ్వ శాంతి మహాయాగ మహోత్సవాలతో నగరంలో ఆధ్యాత్మికత సంతరించుకోవటం సంతోషంగా ఉందని అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ బిగాల అన్నారు. పార్టీలకు అతీతంగా హనుమాన్ యాత్రలో వేలాదిమంది భక్తులు పాల్గొనడం సంతోషకరమన్నారు. భక్తులకు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ వద్ద నీళ్లు, పండ్లు, అల్పాహారం ఏర్పాటు చేశారు. మున్సిపల్, పోలీస్, ఆరోగ్యశాఖ, విద్యుత్ శాఖ తరఫున ఏర్పాట్లు కల్పించామని అన్నారు.





నీరుగొండ హన్మాన్ ఆలయంలో మూల విరాట్టు



కమాండ్ కంట్రోల్ రూంలో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్



శోభాయాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా





నగరంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై హనుమాన్ శోభాయాత్ర

జై బోలో హనుమాన్‌కీ..

- మార్మోగిన నామస్మరణం
- నగరంలో విజయ యాత్ర
- రెపరెపలాడిన కాషాయ జెండాలు
- యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే గణేశ్ బిగాల
- భక్తులకు పండ్లు, మజ్జిగ, అల్పాహారం, పులిహోర పంపిణీ
- ఉదయం 10.30 గంటలకు కంఠేశ్వర్ నుంచి ప్రారంభమై గోల్‌హనుమాన్ వద్ద రాత్రి ముగిసిన ర్యాలీ
- 1500 మంది పోలీసులు, 600 సీసీ కెమెరాలతో నిఘా
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



జిల్లాలో హనుమాన్ జయంతిని భక్తజనం వేడుకగా జరుపుకున్నారు. నగరంలో వేలాది మందితో వీర హనుమాన్ విజయ యాత్ర సాగింది. కాషాయ జెండాలతో నగరం శోభాయమానంగా మారింది. పోలీసులు బందోబస్తు ఏర్పా టు చేశారు.

నిజామాబాద్ సిటీ : జిల్లాలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నగరంలో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీర హనుమాన్ విజయ యాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. రామ లక్ష్మణ జానకీ జై బోలో హనుమాన్‌కీ అంటూ నామస్మరణ మార్మోగిపోయింది. హనుమాన్ డీజే పాటలపై భక్తులు అలుపెరుగకుండా నృత్యాలు చేశారు. కాషాయ రంగు జెండాలతో నగరం శోభాయమానంగా మారింది. నగరంలోని కంఠేశ్వర్ ఆలయం నుంచి ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ర్యాలీ జిల్లా పరిషత్, నాందేవ్‌వాడ, రైల్వేఓవర్ బ్రిడ్జి, దేవిరోడ్డు, గాంధీచౌక్, నెహ్రూపార్క్, పెద్దబజార్ మీదుగా గోల్‌హనుమాన్ ఆలయం వరకు సాగింది. పార్టీలకతీతంగా జరిగిన ర్యాలీని అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ బిగాల, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు..

వీర హనుమాన్ విజయయాత్రలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పలు స్వచ్ఛంద సేవా సంస్థలు యాత్ర సాగిన మార్గంలో మంచినీళ్లు, మజ్జిగ, పులిహోర, అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు.

ఆలయాలు కిటకిట..

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సారంగపూర్ హను మాన్ ఆలయం, నీరుగొండ హనుమాన్ మందిరాలకు నగర ప్రజలతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చా రు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక టెంట్లు వేశారు. అన్ని ఆలయాలలో అన్న ప్రసాద వితరణ, మజ్జిగ, రాగి జావా పంపిణీ చేశారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ నగరంలోని న్యూహౌసింగ్‌బోర్డు కాలనీలో శ్రీ ప్రసన్న అంజనేయ స్వామిని దర్శించుకున్నారు.

భారీ బందోబస్తు

ఖలీల్‌వాడి : నగరంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రకు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. శోభాయాత్ర వెళ్లే మార్గంలో ఇబ్బందులు రాకుండా రోడ్డుకు అడ్డంగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ర్యాలీ వచ్చే గంట ముందు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్ చేశారు. ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ యాత్రను పర్యవేక్షించారు. సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ శోభాయాత్ర సాగిన నాలుగున్నర కిలోమీటర్ల పరిధిలో 600 సీసీ కెమెరాలు, 1500 మంది పోలీసుల సిబ్బందిని వినియోగించారు. వీడియో రికార్డింగ్, మూడు డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. పోలీస్ కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాలతో ర్యాలీని క్షుణ్ణంగా పరిశీలించారు.

న్యూస్‌రీల్

ఈవీఎం గోడౌన్ పరిశీలన



ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్‌లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన గదులను పరిశీలించారు. ఇటీవలే పూర్తయిన మరమ్మతు పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2018 , 2019లలో జరిగిన ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంల గురించి కలెక్టర్ ఆరా తీయగా, వాటిని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కేరళ, తమిళనాడు, గోవా, పంజాబ్ రాష్ట్రాలకు తరలించామన్నారు. ప్రస్తుతం జిల్లాకు వీవీ ప్యాట్లు, ఈవీఎంలతో సహా అన్ని కూడా కొత్త వాటిని కేటాయించారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అత్యవసర స్థితిలో ప్రమాదాలు జరిగితే అగ్నిమాపక సామగ్రి, పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, అగ్నిమాపక శాఖకు చెందిన అధికారి నర్సింగ్ రావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, శాఖల అధికారులు ఉన్నారు.

కొనసాగుతున్న ఎస్సెస్సీ పరీక్షలు



నిజామాబాద్ అర్బన్ : పదోతరగతి పరీక్షలు గురువారం కొనసాగాయి. జిల్లావ్యాప్తంగా 138 సెంటర్లలో పరీక్షలు జరిగాయి. ఇంగ్లిష్ పేపర్ పరీక్ష జరిగింది. జిల్లావ్యాప్తంగా 21,642 మంది విద్యార్థులకు గాను 21,570 మంది పరీక్షలు రాశారు. డీఈవో దుర్గాప్రసాద్ 8 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 49 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ డీఈవోతో కలిసి ఆదర్శ హిందీ మహావిద్యాలయం, కాకతీయ హైస్కూల్, ఖిల్లా ప్రభుత్వ పాఠశాల, విశ్వోదయ పాఠశాల పరీక్ష కేంద్రలను తనిఖీ చేశారు. భద్రతను పరిశీలించారు. సెల్‌ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి తీసుకురావొద్దని ఆదేశాలిచ్చారు.

నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లపై వేటు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : జిల్లాలో నలుగురు ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లపై వేటు పడింది. గతేడాది ఆగస్టులో కేంద్ర, రాష్ట్ర అధికారుల బృందం జిల్లాలో ఉపాధిహామీ పనుల తనిఖీకి వచ్చింది. పనుల్లో తేడాలు, నిబంధనలు అతిక్రమించినట్లుగా గుర్తించారు. పనులకు సంబంధించిన రికార్డులు కూడా సమర్పించలేదని తెలిసింది. ఇందుకు నందిపేట్ టీఏ వినోద, మోస్రా టీఏ అంబర్‌సింగ్, చందూర్ టీఏ దేవిసింగ్, డిచ్‌పల్లి టీఏ సంపూర్ణను సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

త్వరలో తెయూలో హాస్టళ్ల నిర్మాణం

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌లో నూతనంగా బాలికలు (ఎస్టీ), బాలురు (ఎస్టీ) హాస్టళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ గురువారం తెలిపారు. కొన్నేళ్లుగా పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల అడ్మిషన్లలో బాలికలు సంఖ్య అధికంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం క్యాంపస్‌లో రెండు బాలుర హాస్టల్స్, ఒక బాలికల హాస్టల్ ఉన్నాయి. బాలికలు అధికంగా ఉండటంతో హాస్టళ్లలో గదులు సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా నూతనంగా హాస్టళ్ల నిర్మాణం కోసం ఒక్కోటి రూ.10 కోట్లు చొప్పున రూ.20 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు వీసీ తెలిపారు. త్వరలోనే భూమిపూజ చేస్తామన్నారు.

మండుటెండలో ఉపాధి

- చెరువుల్లో గుంతలు తవ్విస్తున్న అధికారులు
- పనిచేసే చోట కూలీలకు కరువైన సౌకర్యాలు
- సేద తీరేందుకు అందుబాటులో లేని టెంట్లు, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు



నిజామాబాద్ మండలం మల్లారం చెరువులో ఎండలో పని చేస్తున్న ఉపాధి కూలీలు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): భానుడి భగభగలకు కాసేపు సేద తీరడానికి ఉపాధి కూలీలకు నీడ కరువైంది. ప్రభుత్వం కొన్నేళ్లుగా టెంట్లను సరఫరా చేయడం లేదు. పనిచేస్తున్న సమయంలో కూలీలకు గాయాలైతే ప్రథమ చికిత్స అందించడానికి ఫస్ట్ ఎయిడ్ కిట్లు కూడా అందుబాటులో లేవు. వీటి సరఫరా కూడా ప్రభుత్వం నిలిపేసింది. గొంతు తడుపుకునేందుకు నీటి సౌకర్యం లేకపోగా, కూలీలే ఇంటి నుంచి నీళ్ల బాటిళ్లు తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగి 40 డిగ్రీలకు చేరుకుంది. ఉదయం 9 గంటలకే భానుడి భగభగలు మొదలవుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచి 11 వరకు కూలీలు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎండదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. వడదెబ్బ తగిలి ప్రతీ ఏటా ఇద్దరు, ముగ్గురు మరణిస్తున్నారు. ఉపాధిహామీ చట్టంలో మాత్రం పని ప్రదేశంలో కూలీలకు నీడ, మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉంచాలని నిబంధనలున్నాయి. మరో రెణ్నెళ్ల పాటు ఎండలు తీవ్రంగా ఉండనున్నందున తమకు సౌకర్యాలు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

గతేడాదితో పోలిస్తే తగ్గిన కూలీలు

ఎండలకు భయపడి గ్రామాల్లోని కూలీలు ఉపాధి పనులకు రావడం లేదు. గతేడాదితో పోలిస్తే కూలీల సంఖ్య సగానికి తగ్గింది. గతేడాది ఏప్రిల్‌లో ఇదే సమయానికి జిల్లావ్యాప్తంగా రోజుకు 40వేలకు తగ్గకుండా కూలీలు పనులకు రాగా, ప్రస్తుతం 25వేల మంది మాత్రమే వస్తున్నారు. తద్వారా మొన్నటి వరకు రాష్ట్రంలో ఆరో స్థానంలో ఉన్న నిజామాబాద్ జిల్లా ప్రస్తుతం 17వ స్థానానికి పడిపోయింది. నందిపేట్, ఇందల్వాయి, మోర్తాడ్, బోధన్, రెంజల్, ధర్పల్లి, ఆర్మూర్, సిరికొండ, మాక్లూర్, మోపాల్, జక్రాన్‌పల్లి, నవీపేట్, కోటగిరి, భీమ్‌గల్ మండలాల్లో ఇప్పుడిప్పుడే కూలీల సంఖ్య పెరుగుతోంది. చందూర్, ఏర్గట్ల, ముప్కాల్, మెండోరా, రుద్రూర్, డిచ్‌పల్లి, నిజామాబాద్, వర్ని ఎడపల్లి మండలాల్లో కూలీల హాజరు సంఖ్య తక్కువగా ఉంటోంది. కూలీల హాజరు శాతం పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లను అధికారులు ఆదేశించారు.

ఉపాధి పనుల తీరు

జాబ్ కార్డులు (లక్షలు)	2.69
సభ్యులు (లక్షలు)	5.55
యాక్టివ్ కూలీలు (లక్షలు)	2.90
గురువారం వచ్చిన వారు (వేలు)	26

ఉదయం పూటే ముగించాలి..

ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నందునా ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలు ఉదయం పూటనే పనులు ముగించుకోవాలి. ఉదయం 6 గంటలకు వచ్చి 10లోగా పనులు పూర్తి చేసుకోవాలి. కూలీల కోసం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు స్థానిక పీహెచ్‌సీల నుంచి తేవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించాం.

– చందర్ నాయక్, డీఆర్‌డీవో, నిజామాబాద్

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఖలీల్‌వాడి : బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం ఈనెల 14న హైదరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు నియోజకవర్గాల నుంచి ప్రజలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ఆమె అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, గొర్రెల పంపిణీ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. 14న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రతిజిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 300మందిని ఆరు బస్సుల్లో తరలించాలన్నారు. మ . ధ్యాహ్నం 1.30 గంటలకు విగ్రహావిష్కరణ సభా వేదిక వద్దకు ప్రజలు వచ్చేలా చూడాలన్నారు. ప్రతి బస్సులో ఒక పోలీస్ కానిస్టేబుల్‌తో పాటు ఏదైనా శాఖకు చెందిన మరో అధికారిని వెంట ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు.రెండోవిడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం త్వరలోనే శ్రీకారం చుడుతందన్నారు. పథకం అమలు కోసం క్షేత్రస్థాయిలో అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని చీఫ్ సెక్రెటరీ కలెక్టర్లకు సూచించారు. గొర్రెల కొనుగోలు, వాటి రవాణా, లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాల పంపిణీ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వీసీలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రా మిశ్రా, డీఆర్‌డీవో చందర్, మెప్మా పీడీ రాములు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి శశికళ, డీపీవో జయసుధ, ఆర్టీసీ ఆర్‌ఎం ఉషాదేవి, ఆర్డీఓలు రవి, శ్రీనివాసులు, పశు సంవర్ధక శాఖ జేడీ జగన్నాథ చారి తదితరులున్నారు.

నేటి నుంచి మాధవనగర్ రోడ్డు మూసివేత

ఖలీల్‌వాడి : నగరంలోని మాధవనగర్ రైల్వేగేట్ రోడ్డును నేటి నుంచి మూసివేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ ఈఈ రమేశ్ తెలిపారు. మధవనగర్ సాయిబాబా ఆలయం సమీపంలో రోడ్డుపై రెండు భారీ పిల్లర్ల నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. మాధవనగర్ రోడ్డు మూసివేస్తున్నట్లుగా బోర్గాం వద్ద బారికేడ్లను కూడా ఏర్పాటు చేశారు. 20 రోజులపాటు ఈ రోడ్డు మూసివేస్తున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది.



నగరానికి నీటి ముప్పు లేనట్లే..

- అలీసాగర్‌లో పుష్కలంగా నీరు
- రోజుకు 700 లక్షల లీటర్ల నీటి సరఫరా
- ప్రస్తుతానికి నీటి సరఫరాకు ఢోకా లేదని అధికారుల ధీమా



అలీసాగర్ రిజర్వాయర్

నిజామాబాద్ నాగారం : ఏప్రిల్ మొదటివారంలోనే ఎండలు మండిపోతున్నాయ్.. ఉదయం నుంచే భానుడు భగభగ మండిపోతున్నాడు. అయితే నగరానికి నీటిని సరఫరా చేసే ప్రధాన జలాశయమైన అలీసాగర్‌లో నీటి లభ్యత ఆశాజనకంగానే ఉంది. రానున్న వేసవిలో నగరానికి తాగునీటి సరఫరాకు ఎలాంటి ఢోకా లేదని అధికారులు ధీమాగా ఉన్నారు.

బొడ్డెమ్మ చెరువు నుంచి సరఫరా బంద్..

నిజామాబాద్ నగరానికి అలీసాగర్, మంచిప్ప, మాసాని, రఘునాథ చెరువుల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. ప్రస్తుతానికి రఘునాథ చెరువులో ట్యాంక్ బండ్ పనులు జరుగుతున్నందు వల్ల నీటి సరఫరా ప్రస్తుతం జరగడం లేదు. అలీసాగర్ రిజర్వాయర్‌లో 0.5 టీఎంసీ నీరు నిల్వ ఉంది. ఇందులో నుంచి ప్రతినిత్యం 400 లక్షల లీటర్ల నీరు ఫిల్టర్ అయి పంపింగ్ ద్వారా నేరుగా నగరంలోని అర్సపల్లి, మాలపల్లి, స్లాటర్‌హౌజ్, నాగారం, డైరీ ఫాం, శాంతినగర్, కంఠేశ్వర్, గంగాస్థాన్, చంద్రశేఖర్, సుభాష్‌నగర్, నాందేవ్‌వాడ, గౌతంనగర్, ధర్మపురిహిల్స్‌లలోని వాటర్ ట్యాంక్‌ల్లోకి చేరుతుంది. ఒక్కో ట్యాంక్ కెపాసిటీ సుమారుగా 13 లక్షల నుంచి 15 లక్షల కెపాసిటీ ఉంది.

మంచిప్ప, మాసాని నుంచి..

మాసాని నుంచి 250 లక్షల లీటర్ల నీరు, మంచిప్ప నుంచి 50 లక్షల లీటర్ల నీరు ఖిల్లా ఫిల్టర్‌బెడ్‌లోకి సరఫరా అవుతోంది. ఇందులో ప్యూరీఫై తర్వాత వినాయక్‌నగర్, బడాబజార్, ఖిల్లా, రేడియోస్టేషన్, గోల్‌హనుమాన్ ప్రాంతాల్లోని వాటర్ ట్యాంక్‌లలోకి నీరు సరఫరా అవుతోంది. మిషన్ భగీరథ ద్వారా మానిక్‌భండార్, దాస్‌నగర్ ప్రాంతంలో ఉన్న మిషన్ భగీరథ నుంచి 100 లక్షల లీటర్ల నీరు తిలక్‌గార్డెన్‌లో వాటర్‌ట్యాంక్‌లోకి నీరు వస్తుంది.

నీటి నిలువ తగ్గితే..

నగరానికి అలీసాగర్, మంచిప్ప, మాసాని నుంచి వచ్చే నీరే ప్రధానం. ఎండతీవ్రత కారణంగా ఇప్పటికే చాలా ప్రాంతాల్లో జలశయాల్లోని నీరు ఇంకిపోతోంది. బోర్లు కూడా ఎత్తిపోతున్నాయి. ప్రస్తుతానికి అన్ని చెరువుల్లో నీరు నిండుగా ఉంది. అయితే రాబోయే రోజుల్లో సమస్య తీవ్రంగా మారవచ్చని శివారు కాలనీలకు నీటిసరఫరా కాకపోతే ఇబ్బందులు వస్తాయని నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. కార్పొరేషన్ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలకు సిద్ధంగా ఉండాలని వారు కోరుతున్నారు.

నీటి సరఫరా వివరాలు..

డివిజన్లు	60
కుటుంబాలు	90,000
జనాభా	3,99,000
అధికారిక నీటికులాయిలు	26,000
అనధికారికంగా..	12,000
నీటి సరఫరా(లక్షల లీటర్లు)	700
నీటి వృథా (లక్షల్లో)	70

నీటి సమస్య రాకుండా చూస్తాం

అలీసాగర్‌లో నీరు నిండుగా ఉంది. నీరు ఖాళీ అవుతుంటే నిజాంసాగర్ ద్వారా నీటిని తరలించేందుకు అధికారులకు లేఖలు రాసి తెప్పిస్తాం. మంచిప్ప, మాసానిలో నీటి సమస్య వస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. నగరవాసులకు నీటి సమస్య లేదు. – ఇనాయత్, శంకర్, ఏఈలు, కార్పొరేషన్

క్లుప్తంగా

ప్రశాంతంగా పీజీ సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఐఎంబీఏ 3వ సెమిస్టర్ పరీక్షల్లో 25 మంది విద్యార్థులకు 23 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఐఎంబీఏ 1వ, 5వ సెమిస్టర్ పరీక్షలలో మొత్తం 50 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ఎల్ఎల్‌బీ 1వ సెమిస్టర్ పరీక్షల్లో 30 మంది విద్యార్థులకు గాను 26 మంది పరీక్ష రాశారు.

సీసీఎస్ సీఐ బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ సీసీఎస్ సీఐ వెంకటేష్‌ను ఆదిలాబాద్ రూరల్ సీఐగా బదిలీ చేశారు. ఖమ్మం క్రైమ్ బ్రాంచ్ సీఐ శ్రీనివాస్ నిజామాబాద్ క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా చేపట్టారు. గురువారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 21,642 మంది విద్యార్థులకు 21,570 మంది పరీక్షలు రాశారు. డీఈవో దుర్గాప్రసాద్ 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



ఖలీల్‌వాడి: పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎస్బీ ఏసీపీ మధుసూదన్‌రావు గురువారం తనిఖీలు చేశారు. నగరంలోని ఆదర్శ హిందీ మహా విద్యాలయం, కాకతీయ హై స్కూల్, ప్రభుత్వ హై స్కూల్, విశ్వోదయ హై స్కూల్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మాస్‌కాపింగ్‌కు తావులేకుండా చూడాలన్నారు. ఆయన వెంట డీఈవో దుర్గాప్రసాద్ ఉన్నారు.

రామారెడ్డిలో అదనపు కలెక్టర్

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డిలోని బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని గురువారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని మౌలిక వసతుల వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



సలాబత్‌పూర్ ఆలయంలో స్వామివారు



సలాబత్‌పూర్‌లో ఆలయ పరిసరాల్లో భక్తులు



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మద్నూర్: మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న మండలంలోని ప్రసిద్ధి చెందిన సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయం గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఎమ్మెల్యే హన్మంత్‌సింధే ఆలయంలో మొదటి పూజను నిర్వహించారు. ఆలయంలో వేదమంత్రాలతో స్వామి వారి జయంతి పూజలు చేశారు. జై హనుమాన్ నామస్మరణతో ఆలయం మారుమోగింది. ఉదయం నుంచి వివిధ గ్రామాల భక్తులు పాదయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. వారికి యువకులు మజ్జిగ, అల్పాహారం పంచిపెట్టారు. ఆలయం మహారాష్ట్ర సరిహద్దులో ఉండటంతో మరాఠీ, తెలుగు, హిందీ భాషల్లో భజనలు కొనసాగాయి. జయంతి సందర్భంగా రెండు రోజుల పాటు పెద్ద ఎత్తున జాతర నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ, ధర్మకర్తల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శుక్రవారం ఆలయ ఆవరణలో జాతర, కుస్తీ పోటీలను నిర్వహించనున్నారు.

మూడు రాష్ట్రాల నుంచి..

ఆలయంలో ప్రతి ఏటా జరిగే జయంతి ఉత్సవాలకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు హాజరవుతారు. గత రెండేళ్లుగా కరోనా బ్రహ్మోత్సవాలు భక్తులు లేకుండానే నిర్వహించారు. ప్రస్తుతం కరోనా భయం లేకపోవడంతో భక్తులు భారీగా హాజరయ్యారు. మూడు రాష్ట్రాల భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద పోలీసులు బందోబస్తు చేపట్టారు.

'ఈ గుళ్లో మొక్కితేనే నేను పుట్టా..'



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సింధే

"సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో మా అమ్మ మొక్కుకుంటే నేను పుట్టానని, అందుకే నాకు ఈ దేవుడి పేరుపైనే హన్మంత్ అని నామకరణం చేశార"ని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. ఆలయంలో గురువారం వేకువజామున ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హనుమంతుడికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అర్చకులు అరవింద్, శైలేంద్ర మహరాజ్ ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.6.5 కోట్లతో ఆలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మరో రూ.2 కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రితో విన్నవించానని ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం భక్తులతో కలిసి ఎమ్మెల్యే భజన చేశారు.

లాక్‌డౌన్ కాలానికి ఫీజు మినహాయించండి



వినతి పత్రం అందజేస్తున్న పరిశోధక విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): కోవిడ్ లాక్‌డౌన్ కాలానికి సంబంధించి ఫీజును మినహాయించాలని తెలంగాణ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వీసీ రవీందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో 2013–14 సంవత్సర పరిశోధక విద్యార్థులు 2017 డిసెంబర్‌లో అడ్మిషన్ పొందారని తెలిపారు. పరిశోధనలు చేసే సమయంలో 2020, 2021లో కోవిడ్ వైరస్ వ్యాప్తితో ప్రభుత్వం లాక్‌డౌన్ విధించిందన్నారు. ఆ సమయంలో పరిశోధనలు నిలిచి పోయాయన్నారు. లాక్‌డౌన్‌లో ఫెల్లోషిప్‌లు రాలేదని, దీంతో తమ పరిశోధనలు ముందుకు సాగలేదని తెలిపారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కోవిడ్ లాక్‌డౌన్ కాలానికి పరిశోధక విద్యార్థులకు ఫీజు మినహాయింపు ఇవ్వాలని కోరారు. సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వీసీ హామీ ఇచ్చారు. ఎల్‌బీ రవి, నాగోల్ల రమేష్, ప్రవీణ్, మహేష్, కాశగౌడ్ ఉన్నారు.

రీవాల్యుయేషన్, కౌంటింగ్‌కు గడువు 24

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో జనవరి, ఫిబ్రవరిలో జరిగిన డిగ్రీ 3వ, 5వ సెమిస్టర్ రెగ్యులర్, 2వ, 4వ, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల రీవాల్యుయేషన్, రీకౌంటింగ్‌కు ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రీవాల్యుయేషన్ ఒక్కో పేపర్ కు రూ.500, రీకౌంటింగ్‌కు రూ.300 చెల్లించాలని, దరఖాస్తు ఫారానికి రూ.25 లు చెల్లించాలని కంట్రోలర్ తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

రుద్రూర్: మోస్రా మండలం చింతకుంట గ్రామానికి చెందిన జంగం శ్రీనివాస్(35) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వివరాలు.. వ్యవసాయ కూలీగా పని చేసే శ్రీనివాస్ పొలానికి నీళ్లు పెట్టడానికి మంగళవారం రాత్రి వెళ్లి తిరిగి రాలేదు. చెరువు వద్ద బుధవారం శ్రీనివాస్ బట్టలు కన్పించడంతో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం చెరువులో శ్రీనివాస్ మృతదేహం లభ్యమైంది. శ్రీనివాస్‌ను గ్రామానికి చెందిన యాదగిరిరెడ్డి పొలానికి నీరు పెట్టడానికని తీసుకెళ్లాడని, యాదగిరిరెడ్డితో పాటు మరో ముగ్గురిపై అనుమానం ఉందని మృతుడి భార్య అనసూయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

రైలు ఢీకొని ఒకరు..

నవీపేట: మండలంలోని అభంగపట్నం శివారులో బుధవారం రాత్రి గుర్తు తెలియని రైలు ఢీకొని అబ్బాపూర్(ఎం) గ్రామానికి చెందిన షాప్రా వెంకటేష్(35) మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్ తెలిపారు. పొలానికి నీరు పారించేందుకు వెళ్లి తిరిగి రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

రెంజల్: కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన సాయిలు(27) ఈ నెల 3న ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. భార్య ఇద్దరు పిల్లలతో పుట్టింటికి వెళ్లడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి భూమయ్య ఫిర్యాదు చేశారని చెప్పారు.

డ్రెయినేజీలో నవజాత శిశువుల మృతదేహాలు

- వస్త్రంలో కట్టి మురికి కాలువలో విసిరేసిన వైనం
- కామారెడ్డిలో అమానవీయ ఘటన

కామారెడ్డిటౌన్: నెలలు నిండకముందే ఆ శిశువులకు నూరేళ్లు నిండాయి. తల్లి కడుపులో నుంచి వచ్చిన వారిని డ్రెయినేజీలో పడేశారు. ఈ అమానవీయ ఘటన కామారెడ్డిలో చోటు చేసుకుంది. పట్టణంలోని బతుకమ్మకుంట డ్రెయినేజీలో నవజాత కవలల మృతదేహాలు కొట్టుకువచ్చాయి. పోలీసులు, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాలు.. బతుకమ్మకుంట కాలనీ మధ్యలో నుంచి ప్రవహించే బడా మురికి కాలువలో నెలలు నిండకుండానే పుట్టిన నవజాత కవలల(ఇద్దరు ఆడ శిశువులు) మృతదేహాలు బుధవారం రాత్రి కనిపించాయి. స్థానికులు గుర్తించి మృదేహాలను బయటకు తీశారు. ఓ వస్త్రంలో ఇద్దరిని కట్టి కాల్వలో పడేసినట్లు గుర్తించారు. ప్రవాహంలో కొట్టుకొచ్చి చెత్త పేరుకుపోయిన చోట మృతదేహాలు ఆగిపోయాయి. పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ నరేష్, ఎస్సై రాములు ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. స్థానిక అంగన్వాడీ టీచర్లను పిలిపించి గర్భిణుల వివరాలను సేకరించారు. పూర్తిగా నెలలు నిండకుండానే ఐదు లేక ఆరు నెలల్లోనే అబార్షన్ అయి ఉండవచ్చని తెలిపారు. ఒక్కో శిశువు అర కిలో బరువు మాత్రమే ఉందని వైద్యుడు విజయ్‌కుమార్ తెలిపారు. గర్భం దాల్చిన మహిళ ఎవరికి తెలియకూడదనే ఈ ఘాతుకానికి పాల్పడిందా.. లేదా అబార్షన్ అయిన తర్వాత కాలువల్లో మృతదేహాలు పడేసారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

అన్నదమ్ములను కలిపిన 'బలగం'



బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్‌లో బుధవారం రాత్రి సర్పంచ్ వనజ గోవర్ధన్‌గౌడ్ ఆధ్వర్యంలో 'బలగం' చిత్రాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌లో ప్రదర్శించారు. సినిమాను తిలకించిన అనంతరం గ్రామానికి చెందిన కుమ్మరి పెద్ద రవి, చిన్న రవి అన్నదమ్ములు ఒక్కటయ్యారు. కొంతకాలంగా దూరంగా ఉంటున్న అన్నదమ్ములు బలగం సినిమా చూసి గురువారం హనుమాన్ జయంతి వేడుకల్లో ఒక్కటయ్యారని గ్రామస్తులు తెలిపారు.

గిరిరాజ్ డిగ్రీ కళాశాల ఫలితాలు విడుదల

నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒకటో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరిలో నిర్వహించిన బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ ఒకటో సెమిస్టర్ ఫలితాలు తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని అరుణ విడుదల చేశారన్నారు. 1374 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 722 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 52.54% ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. రీవాల్యుయేషన్, రీకౌంటింగ్ కోసం ఈ నెల 10 నుంచి కళాశాల పరీక్షల విభాగంలో సంప్రదించాలని సూచించారు.

హనుమాన్ స్వాముల ఆటోను ఢీకొన్న కారు

రుద్రూర్: వర్ని పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోస్రా శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం నుంచి హనుమాన్ దీక్ష స్వాములు మూడు ఆటోల్లో కొండగట్టు వెళ్తున్నారు. మోస్రా శివారులోకి రాగానే చివర ఉన్న ఆటోకు వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో ఆటో పక్కనే నిలిపి ఉన్న గూడ్స్ వ్యాన్‌కు తగిలి ఆగిపోయింది. లేనట్టయితే గుంతలో పడి భారీ నష్టం జరిగేదని స్థానికులు తెలిపారు. ప్రమాదంలో ఆటోలో ముందు భాగంలో కూర్చొన్న ఇద్దరికి గాయాలు కాగా ప్రైవేటు వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై అనిల్ రెడ్డి ఘటన స్థలానికి వచ్చి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

బాల్కొండ: బాల్కొండకు చెందిన గజ్జల రాజేంద్ర ప్రసాద్ (26) కుటుంబ కలహాలతో స్థానిక ఖిల్లా ప్రాంతంలో ఉరి వేసుకుని గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్ర ప్రసాద్ భార్య కాపురానికి రాకుండా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురై చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పురుగు మందు తాగి ఒకరు..

కామారెడ్డి క్రైం: పురుగు మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లి వద్ద గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. మాచారెడ్డి మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన వెల్మ అశోక్‌రెడ్డి (45) వ్యవసాయం చేసుకునేవాడు. ఆయన గురువారం సాయంత్రం రామేశ్వర్‌పల్లి దగ్గర ఖాళీ ప్రదేశంలో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. అశోక్‌రెడ్డి పురుగుమందు తాగినట్లు పోలీసులు గుర్తించారు. కారణాలు తెలియాల్సి ఉంది. విచారణ జరుపుతున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

వైభవంగా రథోత్సవం



రామారెడ్డిలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

రామారెడ్డి: రామారెడ్డిలోని సీతారామచంద్రస్వామి, శ్రీపార్వతీ పరమేశ్వర స్వామి ఆలయాల బ్రహ్మోత్సవాలు ఉగాది నుంచి వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణ సీతారామచంద్రులను, పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి రతల గైని వరకు పల్లకీ తీసుకొచ్చారు. అనంతరం విగ్రహాలను రథాలపై ఉంచి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ సీతారామచంద్ర స్వామి రథం, ఆ తర్వాత శ్రీ పార్వతీ పరమేశ్వరుల రథాలను భక్తులు రతల గైనీ నుంచి సబ్ స్టేషన్ వరకు లాగి, యథాస్థానానికి తీసుకువచ్చారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి హాజరై, ఆలయంలో పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. శుక్రవారం జరిగే ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. రామారెడ్డి సర్పంచ్ సంజీవ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఉస్కె సాయిలు, ఆలయ చైర్మన్ రంగు రవీందర్‌గౌడ్, నామాల రవి, యాదగిరి, పిట్టల గంగాధర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..



ఎల్లారెడ్డిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో శ్రీరాముల వారి రథోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా రాముల వారి ఉత్సవ విగ్రహాలతో రామాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు రథోత్సవాన్ని నిర్వహించారు.

రామారెడ్డిలో రథాలను లాగుతున్న భక్తులు



ఆధ్యాత్మిక జీవనశైలి అలవర్చుకోవాలి



నరేంద్రచార్య మహారాజ్ పాదుకలకు పూజలు చేస్తున్న భక్తులు



హున్సాలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

బోధన్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవన శైలిని అలవర్చుకోవాలి, సమాజహితం ఆకాంక్షను పెంపొందించుకోవాలని మహారాష్ట్ర ప్రాంతం రత్నగిరి జిల్లా నానీజ్‌ధాం పీఠాధిపతి స్వామి నరేంద్రచార్య మహారాజ్ శిష్యులు ప్రబోధించారు. మనం బతకాలి, తోటి వారిని బతకనివ్వాలని పీఠాధిపతి అందించిన ఉపదేశాన్ని అందరూ ఆచరించాలన్నారు. గురువారం సాలూర మండలంలోని హున్సాలో నానీజ్‌ధాం పీఠం జిల్లా సేవాసమితి ఆధ్వర్యంలో నరేంద్రచార్య మహారాజ్ పాదుకా దర్శనం, గురుపూజ, భక్తదీక్ష, ప్రవచనం వేడుకలను నిర్వహించారు. ముందుగా గ్రామం ప్రధాన వీధుల్లో పీఠాధిపతి చిత్ర పటంతో వేలాదిమంది భక్తజనంతో శోభాయాత్రను కొనసాగించారు. వేడకలకు హాజరైన బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్, రూరల్ సీఐ శ్రీనివాస్ రాజు, ఎస్సై సందీప్‌నుగ్రామ ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు సన్మానించారు.

పనులను వేగంగా పూర్తి చేయాలి

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



సిద్దాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. మండలంలోని సిద్దాపూర్ వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. రాత్రింబవళ్లు పనులు చేయాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు, ఇంజినీర్లు 24 గంటలు అందుబాటులో ఉంటూ పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. నాణ్యతలో ఎక్కడా తేడా రాకూడదని సూచించారు. వచ్చే వానాకాలం నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైతే తానే స్వయంగా ఇక్కడ కుర్చీ వేసుకుని పనులను జరిపిస్తానన్నారు.

చైన్‌స్నాచింగ్

డిచ్‌పల్లి: మండలంలోని అమృతాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి సరిత మెడలో నుంచి గుర్తుతెలియని దుండగులు బంగారు గొలుసు చోరీ చేశారు. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం సుమారు 5 గంటలకు నడిపల్లి నుంచి అమృతాపూర్ గ్రామానికి బాలికతో కలిసి సరిత నడుచుకుంటూ వెళ్తుంది. ఇంతలోనే ముఖానికి మాస్కులు ధరించిన ఇద్దరు యువకులు బైక్‌పై వారిని వెంబడించారు. ప్రభుత్వ పాఠశాలకు ఎదురుగా కొద్ది దూరంలో ఎవరూ లేని చోటు చూసి ఒక్కసారిగా ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

మిత్రుడి మృతికి కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలు

ఖలీల్‌వాడి: తన స్నేహితుడు వికాస్ పాఠక్ మృతికి కారకుడైన అరవింద్ యాదవ్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల గురువారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిడుగు రవిరాజ్ తెలిపిన వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అరవింద్, వికాస్ బతుకు దెరువుకోసం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం నెహ్రూనగర్‌లోని రాజ్ కాస్టింగ్ కంపెనీలో కూలీలుగా పనిచేసేవారు. 2020 మే 25న వారు స్నేహితులతో దావత్ చేసుకున్నారు. అందరు సమభాగంలో డబ్బులు చెల్లించుకొని మద్యం తెచ్చుకున్నారు. మిగిలిన రూ.170 అజిత్ కుమార్‌కు ఇచ్చివేయాలని వికాస్, అరవింద్‌తో అన్నాడు. దీంతో నువ్వు మా మధ్యలో పుల్లలు పెడుతావు అంటూ అరవింద్ కోపంతో అతని తలపై కట్టెతో బలంగా కొట్టాడు. తీవ్రగాయాలపాలైన వికాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని మరో స్నేహితుడైన రామశంకర్ ఖరావర్‌తో కలిసి దూరంగా ఉంచారు. నిజామాబాద్ రూరల్ నార్త్ సీఐ అభియోగ పత్రం దాఖలు చేస్తూ అరవింద్, రామశంకర్‌పై అభియోగాలు మోపారు. విచారణ చేపట్టిన కోర్టు ప్రధాన ముద్దాయి అరవింద్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. మరో ముద్దాయి రామశంకర్‌పై నేరం రుజువు కాకపోవడతో నిర్దోషిగా ప్రకటించారు.

భార్య హత్య కేసులో జీవితఖైదు

ఖలీల్‌వాడి: భార్యపై కిరోసిన్ పోసి నిప్పంటించి హత్య చేసిన భర్తకు జీవితఖైదు విధిస్తూ నిజామాబాద్ మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి షౌకత్ జహాన్ సిద్దికి గురువారం తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు.. నిర్మల్ జిల్లా తానూర్ మండలం కోలూర్ గ్రామానికి చెందిన షేక్‌రజాక్ తన కూతురు సనాబేగంను నగరంలోని నిజామ్‌కాలనీకి చెందిన షేక్ ముజీబ్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. వివాహ సమయంలో రూ.లక్ష నగదు, 3 తులాల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండి కట్నరూపంలో చెల్లించారు. కొన్ని నెలల తర్వాత అదనపు కట్నం కోసం ముజీబ్ అతని తోబుట్టువులు షేక్ ఖంరుద్దీన్, అబేదాబేగం, షేక్ సహబ్ జానీ, షేక్ గౌస్, షేక్ చాంద్ పాషా, ఇర్ఫాన బేగం, ఫరీన్‌బేగం, సమ్రీన్ బేగం, మునీర బేగం వేధించడం ప్రారంభించారు. 2017 ఏప్రిల్18 అర్ధరాత్రి షేక్ ముజీబ్ ఎనిమిది నెలల గర్భవతి అయిన తన భార్య సనా బేగంపై కిరోసిన్ పోసి అగ్గిపుల్లతో నిప్పుపెట్టారు. దీపం మీద పడి గాయపడినట్లు నమ్మించి ఆమెను ఆస్పత్రిలో చేర్చారు. గాయాలతోనే సనా మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ పసికందు ఏప్రిల్ 22న మృతిచెందింది. చికిత్స పొందుతున్న సనాబేగం ఏప్రిల్ 25న చనిపోయింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి హత్య నేరం ప్రకారం జీవిత ఖైదు, కట్నం వేధింపులకు గాను ఏడేళ్ల జైలుశిక్ష ఖరారు చేస్తూ తీర్పును ప్రకటించారు. మిగతా ముద్దాయిలపై నేరారోపణలు రుజువు కాకపోవడంతో వారిని నిర్దోషులుగా విడుదల చేశారు.